

లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

5 లక్షల మంది పేదలకు ఇళ్లు : మంత్రి శ్రీధర్‌బాబు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 5 లక్షల మంది పేదలకు ఇళ్లు కట్టించేందుకు సిద్ధంగా ఉందని ఐటీ శాఖ, రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. నగర శివారు పెద్దఅంబర్‌పేట్‌లోని తారా కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 10,050 మంది లబ్ధిదారులకు మంజూరీ అయిన కొత్త రేషన్ కార్డులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూధన్‌రెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో పాటు అధికారులు పాల్గొన్నారు.

కబ్జాకు యత్నించిన కాలనీ స్థలాన్ని పార్కుగా సుందరీకరణ చేస్తాం : హేమంత్ కేశవ్ పాటిల్



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్, కార్పొరేటర్

వనస్థలిపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): కబ్జాకు యత్నించిన కాలనీ స్థలాన్ని పార్కుగా సుందరీకరణ చేస్తానని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. శనివారం వనస్థలిపురం డివిజన్ ఇంజనీర్స్‌కాలనీలో స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి కమిషనర్ పాదయాత్ర నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీకి చెందిన స్థలాన్ని కొంతమంది కాలనీవాసులు కబ్జాకు యత్నించడంతో కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ స్థలాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ స్థలాన్ని కాలనీవాసులు సేదతీరడానికి పార్కుగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో ఏఈ విగ్నేశ్వరీ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామారావు, కాలనీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, శ్రీకాంత్‌రెడ్డి, శైలికుమార్, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కొత్తపేటలో సమస్యల పరిష్కారానికి సహకరించండి

కొత్తపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. శనివారం ఆయన కమిషనర్‌ను కలిసి పలు సమస్యలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయత్రీపురం, ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ, నాగేశ్వర్‌నగర్, బృందావన్‌కాలనీల మీదుగా రూ.కోట్లతో చేపట్టనున్న ట్రంక్‌లైన్ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కాలనీల్లో పాడైన అంతర్గతదారులకు మరమ్మతులు, నూతన రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు.

కూలిన వరదనీటి కాల్వ పైకప్పు

కొత్తపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొత్తపేట డివిజన్ ఎస్‌ఆర్‌ఎల్ కాలనీ రోడ్ నెం.9లో గల ఓ ఇంటి ర్యాంపు వద్ద పాత వరదనీటి కాల్వ పైకప్పు కూలింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ పవన్‌కుమార్ అక్కడికి వెళ్లి జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు సమస్యను పరిశీలించారు. తగిన చర్యలు తీసుకుంటామన్నారు. డీఈ నవీన్‌కుమార్, ఏఈ షరీఫ్, హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌లో రాణించిన స్వదేశీ ఆయుధాలు

- డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి



ఆపరేషన్ సిందూర్ సుగంద్‌పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి, డీఆర్‌డీఎల్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి

చంపాపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో భారత్‌లో తయారైన స్వదేశీ ఆయుధాలు ఎంతో రాణించినట్లు డీఆర్‌డీవో ఛైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో ఉపయోగించిన ఆయుధ వ్యవస్థలపై కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఎల్‌లో శనివారం సిందూర్ సుగంద్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సతీష్‌రెడ్డితో పాటు డీఆర్‌డీఎల్ డైరెక్టర్, విశిష్ట శాస్త్రవేత్త డాక్టర్ జీఏ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ క్షిపణి సముదాయం నుంచి అభివృద్ధి చేయబడిన ఆకాష్ ఎయిర్-డిఫెన్స్, బ్రహ్మోస్, ఎంఆర్‌ఎస్‌ఏఎం, యూఎల్‌పీజీఎం వంటి స్వదేశీ హైటెక్ క్షిపణి వ్యవస్థలు ఆపరేషన్ సిందూర్‌లో అద్భుతమైన పాత్ర పోషించినట్లు అన్నారు. ఈ విజయానికి తోడ్పడిన డీఆర్‌డీవో సాయుధ దళాలు, పరిశ్రమ భాగస్వాములు, ఉత్పత్తి సంస్థలు, ఏజన్సీలను ఆయన అభినందించారు. భవిష్యత్‌లో ఏదైన సంఘర్షణలు సంభవించినప్పుడు ఇలాంటి విజయాలు సాధించడానికి ఆశ్చర్యకరమైన అంశాలతో కూడిన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన వినూత్న డిజైన్లు రూపొందించాలని కోరారు. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ భారతదేశ క్షిపణి వ్యవస్థ, స్వదేశీకరణ విధానాలు ఆపరేషన్ సిందూర్‌లో నిస్సందేహంగా ధ్రువీకరించబడినట్లు అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఎల్ మాజీ డైరెక్టర్, లెఫ్టినెంట్ జనరల్(డాక్టర్)విజే సుందరం, ఆకాష్ వెపన్ సిస్టమ్ మాజీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ప్రహ్లాద, డీజీ(ఎంఎస్‌ఎస్)యు.రాజబాబు, డీఆర్‌డీవో ఛైర్మన్ సమీర్ వి కామత్, ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ జి.రాజాసింగ్ పాల్గొన్నారు.

పోకిరీల భరతం పడుతున్న షీటీమ్స్

- డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించి పలువురి అరెస్ట్
- పోకిరీలకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్

హైదరాబాద్ సిటీ : బాలికలు మహిళలను వేధించే పోకిరీలను ఎట్టి పరిస్థితుల్లో విడిచే ప్రసక్తి లేదని, వేధింపుల బారినపడ్డ వారు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. రాచకొండ సీటీమ్స్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో మహిళలను వేధిస్తున్న 198మందిని పట్టుకున్నారు. వారిలో పోకిరీలకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అశ్లీల ఫొటోలు పంపుతూ యజమానిని వేధిస్తున్న వంటమాస్టర్, మెట్రోస్టేషన్‌లో పనిచేస్తున్న మహిళను వేధిస్తున్న సహోద్యోగి, ప్రేమించమంటూ సోషల్ మీడియాలో వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా బస్టాండ్‌లు, షాపింగ్ మాల్స్, హోటల్స్, మార్కెట్ వంటి రద్దీ ప్రాంతాల్లో డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించిన షీటీమ్స్, వీరి చేష్టలను వీడియో తీసి పోకిరీలను అదుపులోకి తీసుకున్నారు. కమిషనరేట్ పరిధిలో ఈనెల 1 నుంచి 15 తేదీ వరకు షీటీమ్స్ ఆధ్వర్యంలో 73 అవగాహన కార్యక్రమలు నిర్వహించి 14,175 మందికి మహిళా హక్కుల, నేరాలు జరిగే విధానం, అప్రమత్తత వంటి అంశాలపై శిక్షణ అందించారు.

సైబరాబాద్ పరిధిలో..

సైబరాబాద్ షీటీమ్స్ డెకాయ్ ఆపరేషన్లలో భాగంగా బహిరంగ ప్రాంతాల్లో మహిళలను వేధిస్తున్న 36మంది పోకిరీలను అదుపులోకి తీసుకున్నారు. పోకిరీల చేష్టలను రికార్డ్ చేసిన షీటీమ్స్ వారిపై పెట్టీ కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా షీటీమ్స్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో 64అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఆపరేషన్ ముస్కాన్ 11లో భాగంగా 404మంది చిన్నారులను కాపాడారు. వారిలో 14మంది చిన్నారులను షెల్టర్ హోమ్‌కు తరలించారు. బాలలను పనుల్లో పెట్టుకున్న 96మందిపై కేసులు నమోదు చేశారు.

లా పూర్తి చేసిన వారికి ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ : 'లా' పూర్తి చేసిన అభ్యర్థులకు మూడేళ్ల ఉచిత శిక్షణ ఇవ్వడానికి హైదరాబాద్ జిల్లాలోని బీసీ అభ్యర్థుల నుంచి 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ కదీవరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు యూజీసీచే గుర్తించిన విద్య సంస్థ నుంచి "లా" కోర్స్‌లో ఉత్తీర్ణులై ఉండాలని, అభ్యర్థులు లేదా వారి కుటుంబంలో ఎవరైనా గతంలో ఈ ఉచిత శిక్షణ పొంది ఉండరాదని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలని తెలిపారు. బీసీ-ఏ (1), బీసీ-బీ (2), బీసీ-డీ (1)మొత్తం నలుగురు అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఉపసంచాలకులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, హైదరాబాద్ జిల్లా 4వ అంతస్తు, స్వార్తి భవనం, గ్లోబల్ హాస్పిటల్ పక్కన, లక్డీకాపూల్, హైదరాబాద్ అనే అడ్రస్‌కు ఆగస్టు 10వ తేదీ సాయంత్రం 5గంటల వరకు అందజేయాలని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని ఏసీపీ కాశీరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు రామకృష్ణారెడ్డి, గణేష్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి బీమిడి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి పార్వతీ గణేష్‌రెడ్డితో కలిసి వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ టిమహేష్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన ఇష్టానుసారంగా సీఎంపై నిరాధార ఆరోపణలు చేయడం సహించరానిదన్నారు. కౌశిక్‌రెడ్డి ఒక ఎమ్మెల్యే లాగా ప్రవర్తించకుండా వీధి కుక్కలాగ ప్రవర్తించి చేసిన ఆరోపణలపై కట్టుబడి ఉండాలని లేని పక్షంలో వీధి కుక్కను తరమి కొట్టినట్టుగా యూత్ కాంగ్రెస్ నాయకులు నిన్ను తరిమి, తరిమి కొడుతామని హెచ్చరించారు. గతంలో నీ చరిత్ర ఏంది.. ఇప్పటి నీ చరిత్ర ఏంది కౌశిక్‌రెడ్డి అని ప్రశ్నించారు. ఇప్పటికైనా సీఎంకి భేషరతుగా బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో తమ ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కోటేష్‌గౌడ్, రవితేజ, కిరణ్, భాను, మధు, భరత్, వంశీ పాల్గొన్నారు.



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు, షూస్ అందజేస్తున్న కమలాసుధీర్‌రెడ్డి

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ఎమ్మెల్యే లక్ష్యం

- జయచంద్రారెడ్డి ట్రస్టు ఛైర్మన్ దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్ : అనునిత్యం ప్రజా సంక్షేమం, ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న నాయకుడు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అని జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం మన్సూరాబాద్ డివిజన్ సౌత్‌ఎండ్‌పార్కులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జక్కిడి చారిటబుల్ ట్రస్టు ద్వారా వాటర్ బాటిళ్లు, షూస్‌లు అందజేశారు. బీఆర్‌ఎస్ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కమలాసుధీర్‌రెడ్డి విచ్చేసి కేక్‌ను కట్‌చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, పాఠశాల ఛైర్మన్ సుమతి, ఇన్‌చార్జి హెచ్‌ఎం అరుణ, బీఆర్‌ఎస్ నాయకులు పోచబోయిన జగదీష్‌యాదవ్, నర్రి వెంకటన్న, అత్తాపురం రాంచంద్రారెడ్డి, సూరి, బాలరాజ్, మల్లేష్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.